## చిరువ్యాపారుల తరలింపు



చిరువ్యాపారులను క్లబ్‌రోడ్డుకు తరలించడంతో విశాలంగా కనిపిస్తున్న గాంధీచౌక్ ప్రాంతం

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 29 : రోడ్డుపై వ్యాపారం చేస్తూ రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్న చిరువ్యాపారులను మున్సిపల్ సిబ్బంది మంగళవారం క్లబ్‌రోడ్‌కు తరలించారు. రోడ్డుపై విక్రయాలు ఇలా.. రాకపోకలు సాగేదెలా ఎలా..? శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో 29వ తేదీన (మంగళవారం) ప్రచురితమైన కథనానికి మున్సిపల్ సిబ్బంది స్పందించారు. గాంధీచౌక్‌లో రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులను క్లబ్‌రోడ్ వైపు తరలించారు. కూరగాయల వ్యాపారులు పక్కకు తరలివెళ్లడంతో స్వర్ణకార మార్కెట్ నుంచి గాంధీచౌక్ విశాలంగా మారి రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి. మున్సిపల్ సిబ్బంది చిరువ్యాపారులను తరలించి గాంధీచౌక్‌ను ఖాళీ చేయించడంతో పట్టణంలోని 7, 8, 9, 10 వార్డులకు చెందిన ప్రజలు, వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

## భూ వివాదాల పరిష్కారానికే 'భూ భారతి'



మద్నూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

మద్నూర్, ఏప్రిల్ 29 : భూవివాదాల పరిష్కారానికే భూభారతి చట్టమని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. మద్నూర్, డోంగ్లి మండల కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన భూ భారతి రైతు అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. రైతులకు ఏమైనా సమస్యలుంటే భూభారతిలో పరిష్కరిస్తామని తెలిపారు. భూములకు సంబంధించిన పలు సమస్యలను రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, తహసీల్దార్లు ముజీబ్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# అలంకార ప్రాయంగా సాసర్ పిట్స్

- జంతువుల కోసం ఏర్పాటు చేశారు.. నీళ్లు నింపడం మరిచారు
- దాహంతో అల్లాడుతున్న జీవాలు



కృష్ణానగర్ అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సాసర్ పిట్స్

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 29: వేసవి కాలంలో అడవి జంతువులు, పక్షుల దాహాన్ని తీర్చేందుకు అటవీశాఖ ఏర్పాటు చేసిన సాసర్ పిట్స్ అలంకార ప్రాయంగా మారాయి. నీళ్ల లేక ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. బాన్సువాడ మండలంలోని కృష్ణానగర్ తండా శివారులో ఉన్న అటవీ ప్రాంతంలో బాన్సువాడ – కామారెడ్డి ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన సాసర్ పిట్లలో అటవీశాఖ సిబ్బంది నీళ్లు నింపడం లేదు. దీంతో కోతులు, పక్షులు, ఇతర జంతులువు దాహంతో అల్లాడుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో దాహాన్ని తీర్చుకునేందుకు జంతువులు సాసర్ పిట్ల వద్దకు వస్తున్నాయి. అందులో నీళ్లు లేకపోవడంతో తిరిగి వెళ్తున్నాయి. సంబంధిత శాఖ అధికారులు చొరవ తీసుకొని అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సాసర్ పిట్లలో నీళ్లు నింపి, జంతువుల దాహాన్ని తీర్చాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

రామారెడ్డి(గాంధారి) ఏప్రిల్ 29 : గాంధారిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాయకులు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు సాయి కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, గాంధారి మాజీ సర్పంచ్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్యాకేజీ-22'కు నిధులు కేటాయించండి

రామారెడ్డి (సదాశివనగర్), ఏప్రిల్ 29 : జిల్లాలో ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజక వర్గాలకుసాగు నీరు అందించే ప్రాణహిత, చేవెళ్ల 22వ ప్యాకెజికి నిధులు కేటాయించాలని ఉమ్మడి సదాశివనగర్ మాజీ జడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్ రావు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నీటి పారుదల రంగంపై సమీక్ష నిర్వహిస్తున్నందున 22వ ప్యాకేజీ పూర్తి చేసి మెట్ట ప్రాంతమైన ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాలకు సాగు నీరు అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 22 ప్యాకేజీలో భాగంగా భూంపల్లి చెరువు పనులు పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు వచ్చేలా కృషి చేయాలన్నారు. బీసీ మండల నాయకుడు కలాలి సాయాగౌడ్, లింగం తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోళ్లను వేగవంతం చేయాలి



పెద్దకొడప్‌గల్‌లో జొన్నల కొనుగోలు కేంద్రంలో తేమ శాతం పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ డీఎం మహేశ్

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 29 : జొన్నల కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లను వేగవంతం చేయాలని మార్క్‌ఫెడ్ డీఎం మహేశ్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలో మంగళవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఏర్పాటు చేసిన జొన్నల కేంద్రాన్ని సందర్శించారు. జొన్నల తేమశాతాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో పరిస్థితులను రైతులను అడిగి తెలుసుకున్నారు. గన్నీ సంచులు, తూకం తదితర విషయాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సందీప్, సిబ్బంది సంజీవ్, రైతులు తదితరులు ఉన్నారు.

# నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా చూడాలి



పోసానిపేట్ నర్సరీని పరిశీలించిన ఎంపీడీవో తిరుపతిరెడ్డి

రామారెడ్డి, ఏప్రిల్ 29 : రామారెడ్డి మండలంలోని పోసానిపేట్ గ్రామంలో ఎంపీడీవో తిరుపతిరెడ్డి మంగళవారం స్థానిక నర్సరీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నర్సరీల్లో మొక్కలను ఎండిపోకుండా వాచర్లతో తరచూ నీటిని పట్టించాలని పంచాయతీ సెక్రటరీ నరేశ్‌కు సూచించాడు. గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ పరశురాం తదితరులు ఉన్నారు.

## సమస్యలు రాకుండా పకడ్బందీగా అమలు

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

లింగంపేట, ఏప్రిల్29: లింగంపేట మండలంలోని శెట్పల్లి గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. భూ భారతి చట్టం ద్వారా సమస్యలు రాకుండా పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ గ్రామాలకు వీఆర్‌వో, వీఆర్‌ఏలను నియామకం చేయనున్నట్లు ప్రకటించారు. అనంతరం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. లింగంపేట మండలంలో భూ సమస్యలు అధికంగా ఉన్నందున వాటికి భూభారతి చట్టంతో పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేశ్ కుమార్ షెట్కార్, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్‌నాయక్, ఎస్పీ రాజేశ్ చంద్ర, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్, డీఆర్డీవో సురేందర్, ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్ సురేశ్, ఎంపీడీవో నరేశ్, లింగంపేట మండల అధ్యక్షుడు నారాగౌడ్, ఎల్లారెడి ఏఎంసీ చైర్మన్ రజిత వెంట్రాంరెడ్డి, కేన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ఇర్షాద్, జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చోరీలకు పాల్పడిన వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

రాజంపేట్, ఏప్రిల్ 29 : వాహనాలు తనిఖీ చేస్తుండగా చోరీలకు పాల్పడిన వ్యక్తిని పట్టుకున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రాజంపేట పోలీస్ స్టేషన్‌లో ప్రేమ్‌సింగ్, మహ్మద్ అజీమ్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరు మంగళవారం తెల్లవారుజామున అనుమానాస్పదంగా వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తిని ఆపి తనిఖీ చేశారు. అతడి వద్ద చోరీ చేసిన సొమ్ము, వస్తువులు లభించాయి. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా భిక్కనూరు, కామారెడ్డిలో చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చోరీకి పాల్పడిన వ్యక్తిని పట్టుకున్న కానిస్టేబుళ్లను ఎస్సై అభినందించారు.

## తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి



మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో

లింగంపేట(తాడ్వాయి), ఏప్రిల్ 29 : మండలంలోని ఆయా గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి మురళి సూచించారు. తాడ్వాయి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ.. వేసవి సందర్భంగా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. బోరు మోటర్లు చెడిపోతే తక్షణమే మరమ్మతులు చేయించాలన్నారు. పైప్‌లైన్లు లీకేజీలు లేకుండా చూడాలని అన్నారు. క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయాలని చెప్పారు. తాగునీటి సమస్యపై నిర్లక్ష్యం వహిస్తే పంచాయతీ కార్యదర్శులదే బాధ్యత అని స్పష్టం చేశారు. గ్రామాల్లో నిత్యం పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని సూచించారు. నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం వహించొద్దన్నారు. గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాజారాం, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, పంచాయతీ అధికారి సవితారెడ్డితో పాటు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ

బీబీపేట్, ఏప్రిల్ 29: బీబీపేట మండలంలోని శ్రీగాధ రోడ్డు వద్ద ఎస్సై ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని ఎస్సై ప్రభాకర్ సూచించారు. ఏఎస్సై సుబ్రమణ్యం, పోలీస్ సిబ్బంది రవీందర్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I KETADI SAYULU (OLD NAME) S/O KETADI CHINNA SAYULU ,CHANGE MY NEW NAME AS **KETHADI SAYA REDDY** S/O KETADI CHINNA SAYULU H,NO:3-64, SIRPUR, MUGPAL, NIZAMABAD.

NTZ - 336011

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# నిలిచిపోయిన కార్గో సేవలు

- వారం రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 29 : ఎల్లారెడ్డి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న కార్గో పార్శిల్ సెంటర్ సేవలు పాక్షికంగా వారం రోజుల నుంచి నిలిచిపోయాయి. కార్గో సేవలకు సంబంధించిన ఆర్డర్ మిషన్ వారం రోజుల క్రితం చెడిపోయింది. ఆర్టీసీ కార్గో విధులు నిర్వహించే సిబ్బంది సంబంధిత మిషన్ చెడిపోయిందని కార్గో కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్గో సరుకుల ఆర్డర్ మిషన్‌ను బాగు చేయించడంలో సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించినట్లు తెలుస్తున్నది. దీంతో ఎల్లారెడ్డి నుంచి ఇతర ప్రాంతాలకు సరుకులు తరలించాలంటే కార్గో మిషన్ చెడిపోవడంతో బుకింగ్ కావడం లేదు. వారం రోజులుగా ఇతర ప్రాంతాలకు సరుకులు తరలించే వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇతర ప్రాంతాల్లో సరుకులు బుక్ అవడంతో ఇక్కడికి వస్తున్నాయి. కానీ ఇక్కడి నుంచి పార్శిళ్లు బయటికి వెళ్లడం లేదు. ఎల్లారెడ్డి ఆర్టీసీ కార్గోలో సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కార్గో సేవలు పునరుద్ధరించాలని సంబంధిత అధికారులను కోరినా స్పందన కరువైందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్గో సేవలు ఇక్కడి నుంచి నిలిచిపోవడంతో తమకు ఇబ్బందులు ఎదురవడంతో పాటు ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతున్నదని వారు పేర్కొంటున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి కార్గో సరుకుల బుకింగ్ మిషన్‌ను బాగు చేయించాలని వారు కోరుతున్నారు.

## ఆలయ ఉద్యోగి చేతి వాటం

భిక్కనూరు, ఏప్రిల్ 29 : సిద్ధరామేశ్వర స్వామి ఆలయలో ఆలయ ఉద్యోగి చేతివాటం ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి ఆలయ ఈవో శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 22న హుండీ ఆదాయాన్ని లెక్కించారు. దేవాదాయ శాఖ సహాయక కమిషనర్ విజయ రామారావు ఆధ్వర్యంలో హుండీ ఆదాయం లెక్కిపు ప్రక్రియ కొనసాగింది. భక్తులు సమర్పించిన నగదు, కానుకలను లెక్కించే సమయంలో ఆలయంలో ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ అక్కడికి వచ్చాడు. టేబుల్‌పై ఉన్న నోట్ల కట్టలోనుంచి రెండు రూ.500 నోట్లు దొంగిలించగా గమించిన ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పట్టుకున్నాడు. అతడిని మందలించి ఆలయ ఈవోకు ఫిర్యాదు చేశారు. కాగా ఈవో లక్ష్మీనారాయణకు ఈ నెల 23న మెమో జారీ చేసినట్లు ఈవో తెలిపారు.

## చిన్న ఆత్మాకూర్‌లో విద్యుత్ షాక్‌తో మల్టీవర్కర్ మృతి

ఎల్లారెడ్డి రూరల్ (నాగిరెడ్డిపేట్), ఏప్రిల్ 29 : వీధిలైట్లు బిగిస్తుండగా విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతిచెందిన ఘటన చిన్న ఆత్మాకూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగిరెడ్డిపేట్ మండలం పెద్ద ఆత్మాకూర్ వాసి అయిన మహ్మద్ బాబా(42) గ్రామ పంచాయతీలో మల్టీవర్కర్‌గా పనిచేస్తున్నాడు. తన విధుల్లో భాగంగా మంగళవారం చిన్నఆత్మాకూర్ గ్రామంలో వీధిలైట్లు బిగిస్తున్నాడు. బల్బు బిగించిన అనంతరం కిందికి దిగే సమయంలో పైన ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లు తగిలి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లేలోగా మృతి చెందాడు. విధుల్లో ఉన్న సమయంలో విద్యుత్‌షాక్‌తో మృతి చెందడంతో కుటుంబం రోడ్డున పడిందని, సంబంధిత అధికారులు తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఈ విషయమై వివరణ కోసం విద్యుత్ శాఖ అధికారి(ఏఈ)కి పలుమార్లు ఫోన్ చేసినా స్పందన రాలేదు.

## మాజీ సర్పంచును దూషించి, బెదిరించిన వ్యక్తులకు జరిమానా

శక్కర్‌నగర్, ఏప్రిల్ 29: ఎడపల్లి మండలం బాపూనగర్ సర్పంచ్‌గా విధులు నిర్వహించిన మెగావత్ సునీత, ఆమె భర్త రవిని దూషించి, బెదిరించిన కేసులో అదే గ్రామానికి చెందిన ఐదుగురికి జరిమానా విధిస్తూ మంగళవారం బోధన్ జ్యూడీయల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఈ.సాయిశివ తీర్పు చెప్పారు. లైజన్ అధికారి కథనం మేరకు.. బాపూనగర్ పంచాయతీ నూతనంగా ఏర్పాటు కావడంతో అధికారుల సూచనల మేరకు పంచాయతీ భవన నిర్మాణం కోసం గ్రామంలో ఉన్న స్థలాన్ని 2019 సెప్టెంబర్ 23న అప్పటి సర్పంచ్ శుభ్రం చేయిస్తున్నారు. గ్రామానికి చెందిన ఎన్.రాజశేఖర్, ఎన్.రంజిత్ కుమార్, గట్టు కిశోర్, గోక శంకర్, బెక్యం భాస్కర్ జోక్యం చేసుకొని ఈ స్థలాన్ని అంబేద్కర్ భవనం కోసం కేటాయించారని, ఇక్కడ పనులు చేయవద్దంటూ అడ్డుకొని దూషించారు. అడ్డు వచ్చిన అప్పటి సర్పంచ్ భర్త రవిని బెదిరించి దాడికి యత్నించారు. ఈఘటనపై అప్పటి ఎస్సై రామానాయుడు కేసు నమోదు చేశారు. సర్పంచ్‌ను దూషించిన ఐదుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ. 5,500 జరిమానా చెల్లించాల్సిందిగా న్యాయమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు.

## ఇండ్ల నిర్మాణ పనుల పరిశీలన



సుల్తాన్‌నగర్‌లో చేపట్టిన ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో గంగాధర్

నిజాంసాగర్, ఏప్రిల్ 29 : మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎన్నికైన సుల్తాన్‌నగర్ గ్రామంలో ఎంపీడీవో గంగాధర్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామంలో ఐదు ఇండ్లు బేస్మెంట్ వరకు పూర్తయ్యాయని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రవి, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, గ్రామస్తులు ఉన్నారు.

## రేపటి నుంచి వేసవి శిక్షణా శిబిరం

కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 29: రాజంపేట మండలంలోని మినీ స్టేడియంలో మే 1 నుంచి 31వ తేదీ వరకు అథ్లెటిక్స్ కోచింగ్ సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు కోచ్ టి.శివగౌడ్ మంగళవారం తెలిపారు. కామారెడ్డి జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

# బంగారం, నగదు అపహరణ

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 29 : నస్రుల్లాబాద్ మండలం దుర్కి గ్రామంలోని ఉడుతల సుజాత ఇంట్లో నుంచి మంగళవారం గుర్తుతెలియని దుండగులు బంగారం, నగదు అపహరించినట్లు ఎస్సై లావణ్య తెలిపారు. బీడీ వర్కర్స్ కాలనీలో నివాసం ఉంటున్న సుజాత ఈ నెల 9వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి అమ్మ వాళ్ల ఇంటికి వెళ్లింది. గ్రామానికి చెందిన దుర్గం రాజు ఫోన్ చేసి చోరీ విషయమై సుజాతకు తెలుపడంతో కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలో నుంచి 20 గ్రాముల ఒక్క జత బంగారు గాజులు, 10 గ్రాముల చెవి కమ్మలు, రూ.10 వేల నగదును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## బాల్య వివాహాలను నియంత్రించాలి

కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 29: దేశ వ్యాప్తంగా బాల్యవివాహాలను నియంత్రించాలని జస్టిఫర్ రైట్ సాధన సంస్థ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 30న అక్షయ తృతీయ సందర్భంగా అన్ని గ్రామాల్లోని ప్రార్థనా మందిరాల్లో ఈ అంశంపై చర్చించాలని కోరారు. బాల్య వివాహాలను అరికట్టడానికి జస్టిఫర్ రైట్ సాధన సంస్థ ఏడాదికాలంగా చైతన్యవంతమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. సదాశివనగర్, గాంధారి, బాన్సువాడ మండలాల్లోని 50 గ్రామాలను ఎంపిక చేసుకొని ఉద్యమం కొనసాగిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

## ఉపాధి పనుల్లో వంద మందికి తక్కువ కావొద్దు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 29 : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో చేపట్టిన పనుల వద్ద వంద మందికి కూలీలకు తక్కువ కాకుండా చూసుకోవాలని ఎంపీడీవో ప్రకాశ్ సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పనులను సూచించిన కొలతల ప్రకారం ఉదయం ఎండ రాకముందే ముగించాలన్నారు. గ్రామాల్లో జాబ్‌కార్డు ఉన్నవారికి ఈ విషయంపై అవగాహన కల్పించాలని క్షేత్ర సహాయకులకు సూచించారు. క్లస్టర్ల వారీగా సమావేశాలు ఏర్పాటుచేసి గ్రామంలో ఉపయోగపడే పనులను ఎంపిక చేసి ప్రారంభించాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు.

## ఒకరి అదృశ్యం

బీబీపేట్(దోమకొండ), ఏప్రిల్ 29 : దోమకొండలో ఒకరు అదృశ్యమైనట్లు ఎస్సై స్రవంతి మంగళవాం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. దోమకొండ మండల కేంద్రానికి చెందిన ఆవధూత నర్సింహులు(49) ఈ నెల 25వ తేదీ ఉదయం ఇంట్లో నుంచి మేస్త్రీ పనికి వెళ్లి వస్తానని చెప్పి, తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కలా, బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. కొడుకు సిద్ధిశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## క్రికెట్ టోర్నీ ప్రారంభం



కాటేపల్లిలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న నాయకులు

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్ 29 : పెద్దకొడప్‌గల్ మండలంలోని కాటేపల్లి గ్రామంలో కాటేపల్లి అండర్–17 ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకుడు మల్లప్ప పటేల్ క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహసంబంధాలు పెరుగుతాయన్నారు. ఆరోగ్యం కూడా బాగుంటుందని తెలిపారు. ప్రస్తుతం పిల్లలు, యువకులు, పెద్దలు చాలా మంది మొబైల్ ఫోన్‌తోనే కాలక్షేపం చేస్తున్నారని, ఆటలకు స్వస్తి పలికారని అన్నారు. కనీసం రోజుకు ఒక గంట ఆడుకోవాలని సూచించారు. ఆటలతోపాటు చదువుల్లో రాణించాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయిన వారు నిరుత్సాహపడకుండా మళ్లీ గెలిచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ గంగాగౌడ్, నాయకులు ఆకుల రాంచందర్, ఇస్మాయిల్, క్రీడాకారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.